క్లుప్తంగా

విద్యార్థులకు రుచికర భోజనాలు అందించాలి



బండిఆత్మకూరులో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న డిప్యూటీ ఈఓ మహబూబ్ బేగ్

మహానంది: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని డిప్యూటీ ఈఓ మహబూబ్‌బేగ్ తెలిపారు. బండిఆత్మకూరు జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం వండి వడ్డించాలని సూచించారు. భోజనం నాణ్యతపై ఫిర్యాదులు లేకుండా చూడాలని చెప్పారు. ఎంఈఓలు మోహన్‌రెడ్డి, యశోధ, ఉపాధ్యాయులు ఉన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



శివలీలలపై కంజర కథ వినిపిస్తున్న కళాకారుడు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో శనివారం రాజమండ్రికి చెందిన విభూది రామ్‌ప్రసాద్, బృందం ఆధ్వర్యంలో శివలీలలు కంజర కథా గానం కార్యక్రమం నిర్వహించారు. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద కంజర కథ కార్యక్రమం ఏర్పాటు చేశారు. హార్మోనియం సహకారం వై. బాబి , తబల సహకారం వి.చక్రి అందించారు.

కొత్త చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ నాగేంద్ర ప్రసాద్

మహానంది: ప్రస్తుతం అమల్లోకి వచ్చిన కొత్త చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని మహానంది ఎస్‌ఐ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. నూతన చట్టాలపై శనివారం సాయంత్రం పోలీస్ స్టేషన్ వద్ద స్థానికులకు అవగాహన కల్పించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ గతంలో ఉన్న కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ స్థానంలో భారతీయ నాగరిక్ సురక్ష సంహిత చట్టం వచ్చిందన్నారు. ఏఎస్‌ఐ రామకృష్ణ, హెచ్‌సీ ఓబులేసు, పీసీలు చంద్రశేఖర్, శేషన్న, న్యాయవాదులు పాల్గొన్నారు.

మొక్క నాటి సంరక్షించాలి



మొక్క నాటుతున్న ప్రిన్సిపాల్, విద్యార్థులు, ఉపాధ్యాయులు

జూపాడుబంగ్లా: పర్యావరణ పరిరక్షణ నిమిత్తం ప్రతి విద్యార్థి ఓ మొక్కను నాటి సంరక్షించాలని మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ రమేష్ తెలిపారు. శనివారం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మానవుల మనుగడకు అవసరమైన ఆక్సిజన్‌తో పాటు వర్షాలు సమృద్ధిగా కువటానికి వృక్షాలు ఎంతగానో దోహదపడుతాయని తెలిపారు.

హాస్టల్‌లో దోమల నివారణ చర్యలు

ఆత్మకూరు: వెంకటాపురం గ్రామంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో శనివారం మలాథియాన్ ద్రావణాన్ని గదుల్లో పిచికారీ చేయించారు. వైద్యాధికారి పవన్‌కుమార్, సబ్ యూనిట్ అధికారి కృష్ణారెడ్డి మాట్లాడుతూ దోమలు కుట్టకుండా విద్యార్థులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి గదిలోని కిటికీలకు మెష్ అమర్చుకోవాలని వార్డెన్ అంకన్నకు సూచించారు. అనంతరం వసతిగృహంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసి విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

నీటి సమస్య పరిష్కారానికి కొత్త పైపులైన్

పాములపాడు: గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి కొత్త పైపులైన్ పనులు చేపట్టినట్లు సర్పంచు మాణిక్యమ్మ అన్నారు. శనివారం మండలంలోని వేంపెంట గ్రామంలోని 2వ వార్డులో పైపులైన్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ బీసీ కాలనీలోని 2వ వార్డులో 20 సంవత్సరాలుగా నీటి సమస్య ఉందన్నారు. ఈ కాలనీ వాసులు పక్క కాలనీలకు వెళ్లి నీరు తెచ్చుకునేవారన్నారు. గ్రామ పంచాయతీ నిధులతో 100 మీటర్ల మేర పైపులైన్ పనులు చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తిప్పన్న, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రాజేష్, వార్డు సభ్యులు లెనిన్‌బాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణులను పరిరక్షించాలి



బైర్లూటి జంగిల్ సఫారి కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజకుమారి

ఆత్మకూరు: నల్లమల అటవీ పరిధిలోని చెంచు గిరిజనులు పర్యావరణం, వన్యప్రాణులను సంరక్షించాలని నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. మండలంలోని బైర్లూటీ చెంచుగూడాన్ని శనివారం ఆకస్మికంగా పరిశీలించారు. పోతిరెడ్డిపాడు వద్ద సాగునీటిని విడుదల చేసిన అనంతరం బైర్లూటీకి చేరుకున్న కలెక్టర్ చెంచులతో కొంతసేపు ముచ్చటించారు. ఆమె మాట్లాడుతూ అభయారణ్యంలో వన్యప్రాణులు ఎంతో కీలకమైనవన్నారు. ఇటీవల వన్యప్రాణులు అంతరిస్తున్నాయని, వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత గిరిజనులపై ఉందన్నారు. గిరిజనగూడేల అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. గిరిజనులకు వైద్య, విద్య, ఆరోగ్య విషయాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. అనంతరం బైర్లూటీ జంగిల్ సఫారి కేంద్రాన్ని పరిశీలించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ మోహన్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ మనోహర్, సుబ్రహ్మణ్యం, రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు ఉన్నారు.

బాలికలు అప్రమత్తంగా ఉండాలి



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

జూపాడుబంగ్లా: సమాజంలో జరుగుతున్న అఘాయిత్యాలను దృష్టిలో పెట్టుకొని బాలికలు నిత్యం అప్రమత్తంగా ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మలమ్మ సూచించారు . శనివారం మండలంలోని భాస్కరాపురం అంగన్‌వాడీ కేంద్రంలో బాలికలు, గర్భిణు, బాలింతలకు 'మిషన్ శక్తి' కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రుతుస్రావం, వ్యక్తిగత పరిశుభ్రత, యూవ్‌టీజింగ్, సామాజిక స్పృహ అనే విషయాలపై అవగాహన కలిగిఉండి నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. పాఠశాలకు వెళ్లి వచ్చే క్రమంలో ఎవరైనా యూవ్‌టీజింగ్ చేసినా, తాకరాని ప్రాంతంలో తాకటం, వెకిలిగా ప్రవర్తించటం వంటి వికృతచేష్టలకు పాల్పడినా వెంటనే విషయాన్ని తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ ధాజ్‌కుమార్, వైద్యసిబ్బంది రషీద్, ధరేంద్ర, సచివాలయ ఏఎస్‌ఎం కరుణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ



విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపల్ షేక్షావలి

నందికొట్కూరు: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను ప్రిన్సిపల్ షేక్షావలి, అధ్యాపకులు శనివారం పంపిణీ చేశారు. త్వరలో బ్యాగ్‌లు, యూనిఫాంలు వస్తాయని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ వలి, అధ్యాపకులు సుజాత, సురేష్‌బాబు, వెంకటప్రసాద్, నరేంద్ర, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రోజు యోగా, వ్యాయామం చేయాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న టీబీ సూపర్‌వైజర్ రవికుమార్

పాములపాడు: ప్రతి రోజు యోగా, వ్యాయామం చేయాలని టీబీ సూపర్‌వైజర్ రవి కుమార్ అన్నారు. శనివారం మండలంలోని మిట్టకందాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్షయ వ్యాధి, కౌమార దశలో వచ్చే మార్పుల గురించి అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ 15 రోజులకు మించి దగ్గు, జ్వరము, ఆకలి మందగించడం, బరువు తగ్గటం, నీరసంగా ఉంటే గళ్ల, ఎక్సరే పరీక్షలతో క్షయ వ్యాధి పరీక్ష నిర్ధారణ చేసుకోవాలన్నారు. ప్రైవేటు ల్యాబ్‌లలో రూ.3వేలు విలువ చేసే గళ్ల పరీక్షలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా ఆధునిక పరికరాలతో చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రత్నమ్మ, హెచ్‌ఎం మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మపేరుతో మొక్క నాటుదాం



సింగవరంలో తల్లులు, విద్యార్థులకు మొక్కలు అందజేసిన దృశ్యం

మహానంది: ప్రతి విద్యార్థి తన తల్లి పేరుతో ఒక మొక్క నాటడంతో పాటు ప్రతి పుట్టినరోజుకు ఒక మొక్క నాటి సంరక్షించి వృక్ష సంపదను పెంపొందించాలని నంద్యాల జిల్లా నేషనల్ గ్రీన్‌కార్ప్స్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. బండిఆత్మకూరు మండలం సింగవరం జిల్లా పరిషత్ పాఠశాలలో శిక్ష సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా తల్లిదండ్రులు, విద్యార్థులతో 65 మొక్కలను నాటించారు. చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ మార్పుల ప్రభావం మనపై పడకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ వీలైనన్ని ఎక్కువ మొక్కలు నాటాలని సూచించారు. గ్రామస్తులు నబిరసూల్, మణికంఠ, ధనుంజయగౌడ్, మల్లికార్జున పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని పీఎస్సీ కేవీఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ అప్లికేషన్ విభాగంలో ఎంసీఏ, ఎమ్మెస్సీ, కంప్యూటర్ సైన్స్, ఎంటెక్‌లో కనీసం 50 శాతం మార్కులతో పీజీ పాసైన అభ్యర్థులు, పీహెచ్‌డీ లేదా నెట్, సెట్, స్లాట్‌లో అర్హత సాధించిన వారికి ప్రాధాన్యం ఇవ్వబడుతుందన్నారు. విద్యార్హతలతో కూడిన బయోడేటా, సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలను ఆగస్టు 1వ తేదీలోపు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో మెయిల్ ndf2.jkc@fmai .com ద్వా రా పంపాలన్నారు. మరింత సమాచారం కోసం 6302146800 నంబరుకు సంప్రదించాలన్నారు.

జీఓ నంబరు 117ను రద్దు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): జీఓనంబరు 117ను రద్దు చేసి 55వ జీఓ ప్రకారం పాఠశాలల్లో టీచర్లను కేటాయించాలని యూటీఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు ప్రసాద్, సుధాకర్ కోరారు. శనివారం కలెక్టరేట్‌లో డీఆర్‌ఓ పద్మజకు కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఒకటి నుంచి ఐదు తరగతుల వరకు ఒకే పాఠశాలగా నడపాలని, ఒకే సిలబస్, ఒకే పరీక్ష విధానం అమలు చేయాలన్నారు.

నల్లమల ఘాట్‌లో రోడ్డు ప్రమాదం



రోడ్డుకు అడ్డుగా ఉన్న వాహనాన్ని పక్కకు నెడుతున్న ప్రయాణికులు

మహానంది: నంద్యాల–గిద్దలూరు నల్లమల ఘాట్ రోడ్డులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. చింతమాను మలుపు వద్దఎదురెదురుగా వస్తున్న కారు, లారీ ప్రమాదవశాత్తూ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారు రోడ్డుకు అడ్డుగా నిలిచిపోవడంతో కొంతసేపు ట్రాఫిక్ స్తంభించిపోయింది. ప్రయాణికులు, వాహనదారులు రోడ్డుకు అడ్డుగా ఉన్న కారును పక్కకు నెట్టడంతో యథావిధిగా వాహనాల రాకపోకలు సాగినట్లు చెప్పారు. ప్రమాదానికి గురైన వాహనాలు, బాధితుల వివరాలు తెలియరాలేదు.

హాకీ ఫైనల్ పోటీల్లో ఎస్పీజీ విద్యార్థిని విజయం



జంప్‌రోప్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

నంద్యాల(న్యూటౌన్): హాకీ ఆంధ్రప్రదేశ్ ఫైనల్ పోటీల్లో నంద్యాల ఎస్పీజీ హైస్కూల్ పదవ తరగతి విద్యార్థిని లహరి విజయం సాధించారు. ఈ విషయాన్ని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జీవలత, స్టీఫెన్ శనివారం తెలిపారు. కేరళలో ఈనెల 19 నుంచి 26వ తేదీ వరకు సెకండ్ హాకీ ఇండియా సబ్ జూనియర్ మెన్ అండ్ ఉమెన్ సౌత్‌జోన్ చాంపియన్‌షిప్, 2024 హాకీ ఆంధ్రప్రదేశ్ ఫైనల్ పోటీల్లో విజేతగా నిలవడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం లహరిని హెచ్‌ఎంలలతో పాటు ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

చదువుతో పాటు క్రీడల్లో ముందుండాలి

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో ముందుండాలని రామకృష్ణ విద్యాసంస్థల అధినేత డాక్టర్ రామకృష్ణారెడ్డి, రాయలసీమ సాగు నీటి సాధన సమితి అధ్యక్షుడు దశరథ రామిరెడ్డి, జంప్‌రోప్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రమణ అన్నారు. శనివారం నంద్యాల పట్టణంలోని ప్రథమనంది దేవాలయ ఆవరణలో రాష్ట్రస్థాయి జంప్ రోప్ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నంద్యాల జిల్లా కేంద్రంలో రాష్ట్రస్థాయి జంప్‌రోప్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అండర్–12, 14 సబ్‌జూనియర్ విభాగంలో బాల బాలికలకు రాష్ట్రస్థాయి పోటీలకు 16 జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. క్రీడాభారతి అసోసియేషన్ అధ్యక్షుడు సుధాకర్, సీనియర్ న్యాయవాది ఖాదరబాద్ , వెంకటరాముడు పాల్గొన్నారు.

వీధి దీపాల ఏర్పాటు



వెలుగుతున్న వీధి దీపాలు

సాక్షి ఎఫెక్ట్

మహానంది: నెల రోజులుగా మహానందిలో చిరుత సంచరిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఆలయ అధికారులు ప్రాంగణాల్లో వీధి దీపాలు ఏర్పాటు చేయకపోవడం విశేషం. మహానందిలోని పెద్దనంది విగ్రహం నుంచి గరుడ నంది వరకు వీధి దీపాలు లేక చీకటి అలుముకున్న వైనంపై సాక్షి దినపత్రికలో శనివారం ప్రచురితమైన 'భయం...భయం' శీర్షికన ప్రచురితమైన కథనానికి దేవస్థానం అధికారులు స్పందించారు. శనివారం ఉదయం అన్ని విద్యుత్ స్తంభాలకు లైట్లు ఏర్పాటు చేసినట్లు ఆల య ఏఈఓ ఓంకారం వేంకటేశ్వరుడు తెలిపారు.

నేడు శాకాంబరి అలంకరణ

ఆత్మకూరు: స్థానిక శివాలయంలో పార్వతీదేవిని ఆదివారం శాకాంబరిదేవి అలంకరణలో అలంకరిస్తున్నట్లు అర్చకులు శనివారం తెలిపారు. అమ్మవారి అలంకరణలో భాగంగా కూరగాయలతో అమ్మవారిని అలంకరిస్తామని చెప్పారు.

నీట మునిగిన పంటలను కాపాడుకోవాలి

కొత్తపల్లి: అధిక వర్షాల కారణంగా నీట మునిగిన పంటలను ఎలా కాపాడుకోవాలో రైతులకు అవగాహన కల్పించాలని, ఖరీఫ్ సీజన్ పంటల సాగుకు అవసరమైన ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచాలని ఏఓ కె.మహేష్ సూచించారు. శనివారం స్థానిక కార్యాలయంలో రైతు భరోసా కేంద్రాల సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయి రైతుసేవా కేంద్రాల సిబ్బంది సమయ పాలన పాటిస్తూ రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. అదేవిధంగా అధిక వర్షాల కారణంగా నీటమునిగిన పంటలను సిబ్బంది సందర్శించి రైతులకు పంటలు కాపాడుకోవడంపై అవగాహన కల్పించి, సలహాలు సూచనలు ఇవ్వాలని సూచించారు.

చిరస్మరణీయుడు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం

పాములపాడు: భారత దేశ ప్రజలు ఎప్పటికీ మరువ లేని వ్యక్తి మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం అని శ్రీ వివేకానంద విద్యావిహార్ హై స్కూలు అడ్మినిస్ట్రేటర్ దేవిక అన్నారు. శనివారం స్కూలు ఆవరణలో అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది షాజహాన్, సురేంద్ర, రామస్వామి, హబీబుల్లా, నారాయణాచారి తదితరులు పాల్గొన్నారు.

ముంపు బాధితులకు ఉద్యోగాలివ్వాలి

జూపాడుబంగ్లా: 98జీవో కింద నీటిముంపు బాధిత నిరుద్యోగులకు సత్వరమే ఉద్యోగాలు కల్పించాలని సీపీఐ పార్టీ నాయకుడు రమేష్ బాబు డిమాండ్ చేశారు. శనివారం పోతిరెడ్డిపాడు గేట్లు ఎత్తడానికి వచ్చిన ఎమ్మెల్యే జయసూర్యకు వినతిపత్రం అందజేశారు. అలాగే జూపాడుబంగ్లా ఎత్తిపోతల పథకానికి మరమ్మతుల నిమిత్తం రూ.50లక్షల నిధులను మంజూరు చేయించి రైతులకు సాగునీరు అందించాలన్నారు. చాబోలు గ్రామస్తులకు జూపాడుబంగ్లా ఇస్తామన్న ఇళ్లస్థలాలు త్వరగా కేటాయించాలని, తాటిపాడు వద్ద నూతన లిఫ్టును ఏర్పాటుచేసి మండ్లెం, తంగడంచ, భాస్కరాపురం, తర్తూరు గ్రామాల్లోని బీడుభూములకు సాగునీరిచ్చి ఆదుకోవాలని కోరారు.

అభ్యసన సామగ్రితోనే మెరుగైన బోధన

వెలుగోడు: బోధన అభ్యసన సామగ్రి (టీఎల్‌ఎం) ద్వారా విద్యార్థులు పాఠాలను చక్కగా అర్థం చేసుకుంటారని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జి.ఎస్. రవిశంకర్ అన్నారు. ఈనెల జూలై 22 నుంచి శిక్ష సప్తాహ్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం పాఠ్య పుస్తకాలు, ప్రత్యేకమైన అభ్యసనా ఫలితాలకు అనుగుణంగా టీఎల్‌ఎంలను ఉపాధ్యాయులు విద్యార్థులు సహకారంతో తయారు చేసి ప్రదర్శించారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులతో మొక్కలు నాటారు. ఉపాధ్యాయులు బి.సుబ్రహ్మణ్యం, జీవీ.సుబ్బయ్య, ఎం.నరసింహులు, మొయినుద్దీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

నాటుసారా స్వాధీనం

మహానంది: మండలంలోని బుచ్చమ్మ తోట గ్రామానికి చెందిన ఒకరిని అదుపులోకి తీసుకుని శనివారం నాటుసారా స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. శనివారం 800 లీటర్ల నాటుసారా ఊట ధ్వంసం చేయడంతో పాటు గ్రామానికి చెందిన గోపి వద్ద 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని చెప్పారు. గ్రామాల్లో నాటుసారా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ హెచ్చరించారు.

బానకచెర్ల నుంచి నీరు విడుదల



గేట్ల స్విచ్ ఆన్ చేస్తున్న ఎస్‌ఈ వెంకటరమణయ్య

పాములపాడు: మండలంలోని బానకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి శనివారం 10వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎస్‌ఈ వెంకటరమణయ్య గేట్ల వద్ద పూజ చేసి స్విచ్ ఆన్ చేసి గేట్లు ఎత్తారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి ఎస్‌ఆర్ ఎంసీ కాలువ ద్వారా 10వేల క్యూసెక్కుల నీరు దిగువకు వస్తుందన్నారు. ఈ నీటిని తెలుగుగంగ (వీబీఆర్)కు 9000 క్యూసెక్కులు, కేసీసీ ఎస్కేప్ ఛానల్‌కు వెయ్యి క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నట్లు తెలిపారు. కాగా జీఎన్‌ఎస్‌ఎస్‌కు ఇప్పుడు నీరు విడుదల చేయబోమని వెల్లడించారు. కార్యక్రమంలో ఈఈ పార్థసారథి, డీఈఈలు నాగేంద్రకుమార్, ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఏఈఈ దేవేంద్ర, విశ్వనాథ్, ఏఈ మధుసూదన్ రావు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



వాహదారులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఏఎస్‌ఐ బాబా పక్రుద్దీన్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు చట్టాలపై, అంబేడ్కర్ సర్కిల్‌లో వాహదారులకు రోడ్డుభద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సమాజంలో జరిగే మంచి చెడులను దృష్టిలో ఉంచుకొని చట్టాలను తెలుసుకోవాలన్నారు. కానిస్టేబుల్ అష్ఫక్, తదితరులు ఉన్నారు.

మల్లన్న సేవలో కార్మిక శాఖ మంత్రి



మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు స్వామి వారి చిత్రపటాన్ని అందిస్తున్న ఈవో

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. శనివారం మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన మంత్రికి ఆలయ రాజగోపురం వద్ద ఈఓ డి.పెద్దిరాజు, కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ బాలునాయక్, డిప్యూటీ కమిషనర్ కే.వెంకటేశ్వర్లు, అర్చకస్వాములు, వేదపండితులు ఆలయ సంప్రదాయ ప్రకారం స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీ మల్లికార్జున స్వామివారికి అభిషేకం, భ్రమరాంబికా దేవికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆలయం వద్దనున్న ఆశీర్వచన మండపంలో మంత్రికి పండితులు వేద మంత్రాలు పలకగా, అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. ఆలయ అధికారులు స్వామి వారి శేష వస్త్రం, లడ్డూ ప్రసాదాన్ని అందించి సత్కరించారు.

వేతనాలు ఇవ్వకుండా వేధిస్తున్నారు

జూపాడుబంగ్లా: మండలంలోని తంగడంచ గ్రామ సమీపంలో ఉన్న జైన్‌కంపెనీలో రోజువారీ కూలీగా పనిచేస్తున్న వారికి ఐదు మాసాలుగా వేతనాలు అందడం లేదని శనివారం విలేకరుల ఎదుట వాపోయారు. వారు మాట్లాడుతూ కంపెనీలో 28 మంది రోజువారీ కూలీగా విధులు నిర్వహిస్తున్నారు. రోజుకు ఒకరికి రూ.381, పీఎఫ్ కింద రూ.40లు ఇవ్వాల్సి ఉందన్నారు. అయితే కంపెనీకి కూలీలను సప్‌లైచేసే చంద్రాస్ టీ.పవర్ అనే కాంట్రాక్టర్ ఐదు మాసాలుగా కూలీలకు ఇవ్వాల్సిన వేతనాలు, పీఎఫ్ డబ్బులు చెల్లించకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. కూలీల డబ్బులు చెల్లించాలని కాంట్రాక్టర్‌ను అడిగినా పట్టించుకోవటం లేదని వాపోయారు. జైన్ కంపెనీలో సెక్యూరిటీ గా విధులు నిర్వహిస్తున్న 22 మందికి ఐదు మాసాల నుంచి జీతాలు, ఈపీఎఫ్ చెల్లించటం లేదని, డీవైన్ సెక్యూరిటీ సంస్థ ఐదు మాసాల నుంచి సతాయిస్తోందని చెప్పారు. ఈ విషయమై కంపెనీ పీఆర్‌ఓ మౌలాలిని వివరణ కోరగా కూలీలకు వేతనాలు చెల్లించాలని చంద్రాస్ టీ.పవర్ కాంట్రాక్టర్‌కు సూచించామని ఆయన వేతనాలు చెల్లించటంలో జాప్యం చేస్తున్నారన్నారు. ఈ విషయాన్ని కంపెనీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

గొర్రెల మందపై చిరుత దాడి



చిరుత దాడిలో గాయపడిన మేకపోతు

రుద్రవరం: మండల పరిధిలోని అప్పనపల్లె గ్రామ సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతం వద్ద శనివారం గొర్రెలు, మేకల మందపై చిరుత దాడి చేసింది.ఈ ఘటనలో ఓ మేక పోతుకు గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. మొహరం వేడుకల్లో భాగంగా రెండు రోజుల్లో జియారత్ నిర్వహించాల్సి ఉంది. అందుకోసం కొన్ని మేక పోతులు కొనుగోలు చేసి గొర్రెల మందలో వదిలారు. దిన చర్యలో భాగంగా గొర్రెల కాపరి మందను తోలుకొని గ్రామానికి సమీపంలో ఉన్న వినాయక ప్లాంటేషన్‌వైపు వెళ్లాడు. సాయంత్ర ప్లాంటేషన్ పొదల్లో నుంచి చిరుత గొర్రెల మందలోని ఓ మేక పోతుపై దాడి చేసింది. దూరంగా ఉన్న కాపరి వెంటనే చిరుత మీదకు రాళ్లు విసరగా అది పారి పోయింది. చిరుత దాడి విషయం చుట్టు పక్కల గ్రామాలకు పొక్కడంతో అటవీ సమీప పొలాల్లో ఉనన రైతులు భయాందోళన చెందుతున్నారు. ఈ విషయంపై రుద్రవరం రేంజి అధికారి శ్రీపతినాయుడు దృష్టికి తీసుకెళ్లగా రైతులు అప్రమత్తంగా ఉండాలని, చిరుత బయటకు రాకుండా అడవిలోకి వెళ్లేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

అ'పూర్వ' కలయిక

నందికొట్కూరు: పట్టణంలోని 1921లో నిర్మించిన మండల పరిషత్ పాఠశాల శతాబ్ది ఉత్సవాలు, పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థులు తమ చిన్ననాటి అల్లరి, స్నేహితులతో గడిపిన మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు, డాక్టర్ దేశెట్టి శ్రీనివాసులుతో పాటు సీనియర్ ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రిటైర్డు పీడీ శంకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు శోభారాణి, దుర్గప్రసాదరావు, మహబూబ్‌బీ, రాజసాగర్, నాగరాజు, ప్రస్తుత హెచ్‌ఎం నరహరి దాసు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు